# కలి "ఆలి" గోల

వినండయ్యా! జనులారా వినండి! దేశాంతర దేహాంతర కాలాంతరాల్లో ఆత్మకర్మ ఫలాన్ని అనుభవిస్తుందనేమాట అబద్ధం! వేదం ప్రమాణం కాదయ్యా! వేదాన్ని ఖండించి బోధి సత్వుడు ఈ ప్రపంచం అస్థిరమని చెప్పాడు! బుద్ధిలేనివాళ్లు, పౌరుషం లేనివాళ్లు ఆచరించేది వేద ధర్మం. వాళ్ళే అగ్నిహోత్రాన్ని త్రిదండాన్ని స్వీకరిస్తారు!

నామాట వరలమూట! వినండి! స్వేచ్ఛే ధర్మం! మన్మధుడే దైవం! చావు ఒక్కటే చివరి గమ్యం. చచ్చాక తిరిగి రావడం అనేది అబద్ధం చచ్చి, బూడిదై తిరిగొస్తామనేది భ్రాంతి.

వినండయ్యా! వినండి! ఇంద్రుడికంటే పెద్ద దేవుడున్నాడా! ఆతడు వంద యజ్ఞాలు చేశాడు. అతడు అహల్య కోసం పడిన పాట్లు పొందిన చేట్లు తెలియవామీకు! అతడలా కష్టపడినా అహల్య కోసం వెంపర్లాడడం ఇతర్లని ఇచ్చానుసారం జారత్వం చెయ్యమని అనుజ్ఞ ఇవ్వడం కాదా? ఆలోచించండి!

ఈ విధంగా కవి భటులు విపరీతవాదం చేస్తూ వస్తున్నారు! వినేవాళ్ళంతా విభ్రాంతిపాలై నిలబడి పోయారు. అది చూసి ఇంకా రెచ్చిపోయి—

"చెక్కిన రాతి బొమ్మల మీద పూలేసి పూజచేసి ఫలం వస్తుందని ఆశపడ్తున్నారు. దాన్నెలా నమ్మడం! ఓ భక్తులారా! ఆలోచించండి! చెట్టు మీంచి ఎప్పుడైతే పూవుకోస్తామో అప్పుడే దానికి ఫలించే అవకాశంపోతుంది కదా! ఇకపూల పూజవల్ల ఎలా ఫలాలొస్తాయి!

అయ్యా! మనశాస్త్రిలు చెప్పేది వేరు. వేదాలు వర్ణించేది ఇంకొక తీరు. ఉపనిషత్తుల మార్గం వేరు బురదలోని స్తంభం లాంటిది. తర్కం— మీ పారాయణ మంత్రార్థాలు వేరు. సాంఖ్యయోగ సిద్ధాంతం వేరు. వీటితో ందుకు ఛస్తారు కష్టం లేని సుఖం దక్కే—మార్గం ఎన్నుకోండి"

అని బోధించారు-ఆమీదట ఆగకుండా పెచ్చుమీరి ఢంకా బజాయించి తమ "సిద్ధాంతము" ివ్వసాగారు.

"వినండి! బాగా వినండి! ఈ దేహం ఆఖరికి మంటల్లోపడి బూడిదై పోయేదే కాదా! ఇంకాపాపం ఎలా మిగిలి ఉంటుంది! ఈ శరీరంతో చేసిన పాపాలు ఈ శరీరంతోనే పోతాయి నమ్మండి! కాబట్టి పరమ సుఖానిచ్చే పరస్త్రీ సంగమాన్ని స్వీకరించండి! ఓపికున్నంత వరకు చేతనయినన్ని పాపాలు చెయ్యండి!"

ఇవన్నీ ఎందుకోసం అంటారా?

మీరు బాగా ఉన్న దేవతలేం చేశారు. కర్ణుడిచర్మం ఒలిచి-కవచాన్ని తీసుకున్నారా లేదా? దధీచి ఎముక లేరుకున్నారా లేదా? బలిని పాతాళానికి తొక్కేశారా లేదా? జీమూతా వాహనుడి ప్రాణాలు తీశారు లేదా? శిబి కథేమిటి? సముద్రాన్ని ఎలా చిలికారు? చంద్రుడ్నెలా తినేశారు? కల్పవృక్షం మాటేమిటి? దేవతలు ఎంతకయినా తగిన వాళ్ళు! వాళ్ళ నీతుల కతలు మనకొద్దు—"

ఇలా విజృంభించి కలిభటులు దూరాచారాన్ని సమర్థిస్తూ సదాచారాన్ని ఖండిస్తూ, వేదాన్ని నిందిస్తూ స్వేచ్ఛని అభినందిస్తూ వస్తూఉన్నారు. అది చూసిన దేవతలకు ఒళ్లు మండిపోయింది.

వాళ్ళు నలుగురు-ఇంద్రుడు - యముడు - వరుణుడు-అగ్ని - వాళ్ళు నలుగురూ దమయంతీ స్వయంవరానికి వెళ్ళి-నలుడిని దూతగా పంపించి—చివరికి దమయంతి నలుడినే వరిస్తే ఆశీర్వదించి తిరిగొస్తూఉంటే వాళ్ళకు ఎదురయ్యారు కలిబంట్లు-వాళ్ళని చూడనే చూసిన నలుగురు దేవతలూ చివాట్లు పెడితే "అయ్యా లారా! మారాజు కలి? మేం అతని కైవారాలు ఇలా చెప్పాలి లేకపోతే మాపై ఆగ్రహిస్తారు. మేం పరాధీనులం. చెయ్యమన్నట్టు చేసే బంట్లం మమ్మల్ని మన్నించండి!" అని చేతులు జోడించారు.

అప్పుడు కాకి కేతనంతో కాలాసనంతేరులో నల్లని శరీరంతో నిగనిగ లాడ్తూ వచ్చాడు కలిపురుషుడు. వాళ్ళని చూసి పలకరించి, నమస్కరించి తాను దమయంతీ స్వయంవరానికి వెళ్తున్నానని ఆశీర్వదించి పంపండని కోరాడు కలి!

అదివిని "అదేంటయ్యా!! నిన్ను బ్రహ్మ బ్రహ్మచారిగా చేశాడుకదా! పెళ్ళంటా వేటి? అయినా దమయంతికి నలుడితో పెళ్ళైపోయింది కదా! మేం ఇప్పుడక్కడినుంచే వస్తున్నాం! ఆ దమయంతి నాగులను పరిత్యజించింది. వేల్పుల ధిక్షేపించింది రాజులను తిరస్కరించింది. నలుడిని వరించింది.

ఏం చేస్తాం! ఈశ్వరాజ్ఞ బలీయసి మాతోపాటే తిరిగి పోదాం రా! అన్నారు నలుగురూ!

అదివిన్న కలి భగ్గుమన్నాడు.

"బ్రహ్మకేం? మీకేం మీకంతా భార్యలు ఉన్నారు. మీరు సుఖపడ్తున్నారు? నైష్ఠిక బ్రహ్మచర్యంలో నేను చెడితే చెడతాను. మీకేమిటి? మీ సుఖాలకు ఏంలోటు లేదుకదా!

ఆమె మిమ్మలందర్నీ కాదని-ఒక మానవుడ్ని వరిస్తూవుంటే ఎలా ఊరుకున్నారు? ఇదంతా వదిలెయ్యండి! నేవెళ్ళి ఆమెను ఎత్తుకొస్తాను. పాకశాసనుడు (ఇంద్రుడు) పావకుడు అగ్ని.) పరేతపతి (యమధర్మరాజు), పాశహస్తుడు (వరుణుడు) పంచముడ నేను (నేను)—మనం ఈ అయిదుగురం కలిసి-పాండవులు ద్రౌపదిని పంచుకున్నట్లు పంచుకొని అనుభవిద్దాం! అన్నాడు కలి.

ఆ మాటలు విని నలుగురూ ఛీ ! ఛీ ! అని చివాట్లు పెట్టారు. నలుడి ధర్మ నిరతిని పొగిడారు.

అప్పుడు కలి వాళ్ళకు నమస్కరించి తానెలాగయినా కొన్నాళ్ళు భూమ్మీద వుండిపోయి ఆరాజ్యంలో ఎవడో ఒకడు తప్పుచేస్తే తానువాడిలో దూరిపోయి - ఆరకంగా - ప్రజల తప్పు రాజుదేకాబట్టి - రాజును పట్టి పీడిస్తానని వెళ్ళిపోయాడు.

హర్షనైషధాన్ని ఆంధ్రీకరించిన శ్రీనాధుడు శృంగార నైషధంలో కలి చేష్టల్ని, కలిబుద్ధిని, కలివిజృంభణాన్ని ఎంతో చక్కగా చెప్పాడు.

—o—